క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాల: మండలంలోని గురజాల, దైద, పులిపాడు గ్రామాల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాల, దైద, పులిపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లకు సంబంధించి మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైతు పథకాలను మేనిఫెస్టోలో పెట్టాలి



పిడుగురాళ్ల: రైతులకు సంబంధించిన పథకాలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముత్యం బాలగంగాధర్‌రెడ్డి రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా ముత్యం బాలగంగాధర్‌రెడ్డి శనివారం మాట్లాడుతూ.. దేశంలోని అన్ని పార్టీలు రైతులకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఉచిత పథకాలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి



పిడుగురాళ్ల: అగ్ని ప్రమాదాల నివారణకు మహిళలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పిడుగురాళ్ల అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ వంట గదిలో గ్యాస్ సిలిండర్ పైపు లీక్ కాకుండా చూసుకోవాలని చెప్పారు. గ్యాస్ పైపులు ఎక్కువ రోజులు వాడకుండా కంపెనీ వారు చెప్పిన సమయం వరకు మాత్రమే వాడాలని వివరించారు. పలు సందర్భాల్లో గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ అయినప్పుడు భయపడకుండా గోనె సంచి లేదా తడి గుడ్డ సిలిండర్ మీద వేస్తే మంటలు ఆరిపోతాయని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది పీవీ రమణారావు, బి. మరియదాసు, జెడ్ రవి, కె. రామారావుతో పాటు మహిళలు పాల్గొన్నారు.

తండ్రి వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: తండ్రి వేధింపులపై కుమార్తెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.హజరత్తయ్య శనివారం తెలిపారు. వివరాల మేరకు..ముప్పాళ్ళలోని ముస్లిం కాలనీకి చెందిన భార్యాభర్తలు షేక్ మాబు సుభాని, రిహానా కుటుంబ సమస్యలతో వేర్వేరుగా ఉంటున్నారు. మాబు సుభాని పిడుగురాళ్ళలో నివాసముంటుండగా, రిహానా తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి ముప్పాళ్ళలో ఉంటోంది. మాబు సుభాని గురువారం ముప్పాళ్ళ వచ్చి రిహానా, పిల్లలతో ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలో పెద్ద కుమార్తె ఆసియా, భార్య రిహానా ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడిపూడిలో బాల్య వివాహం నిలిపివేత

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో బాల్య వివాహం జరగకుండా శనివారం అధికారులు నిలిపివేశారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని చైల్డ్ హెల్ప్ లైన్‌కు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన బాల్య వివాహాల నిరోధక ప్రొటెక్షన్ అధికారి ప్రశాంత్ కుమార్ శనివారం గ్రామాన్ని సందర్శించి, బాల్య వివాహాన్ని నిలిపివేశారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆర్.అరుణ, జీఎంఎస్ కె.భాగ్యలక్ష్మి, నౌరీన్, వీఆర్వో, ప్రధానోపాధ్యాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన.. వలంటీరుపై వేటు

అచ్చంపేట: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన చిగురుపాడు వలంటీరు అన్నం పూర్ణచంద్రరావును విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చిగురుపాడు గ్రామానికి చెందిన అన్నం పూర్ణచంద్రరావు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ద్వారా ఆ పార్టీ కండువా కప్పించుకుని బహిరంగంగా చేరారని, అందువల్ల అతనిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ ప్రదాత జగనన్నకు అండగా ఉందాం

ప్రభుత్వ విప్, మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి



లచ్చంబావి గ్రామస్తులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

మాచర్ల రూరల్: ఐదేళ్ల సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబం సంక్షేమ లబ్ధి పొంది, అభివృద్ధి సాధించిందన్నారు ప్రభుత్వ విప్, మాచర్ల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి. ఫలాలందుకున్న ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. శనివారం మండలంలోని లచ్చంబావి గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు ఆ పార్టీకి రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ను, ఎమ్మెల్యేగా తనను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. లచ్చంబావి గ్రామానికి చెందిన జాల కోటేశ్వరరావు, సూదనబోయిన సురేష్, కంబాల మల్లికార్జునరావు, కంబాల చిన మల్లయ్య, వి.మోహన్, ప్రభాకర్ తదితరులను పార్టీ కండువాలు కప్పి పీఆర్కే సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ ఆకన బోయిన వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కంబాల చిన వెంకయ్య, జింకల సాంబయ్య, జాలా పెద అంజి, కంబాల గోవింద్, రమేష్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో 15 కుటుంబాల చేరిక

విజయపురిసౌత్: స్థానిక డౌన్ మార్కెట్‌కు చెందిన 15 మత్స్యకారుల కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. విజయపురిసౌత్‌లో శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి, వారిని సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని పార్టీలో చేరిన ఎరిపెల్లి అప్పలరాజు, మైలపల్లి శ్రీను, కారే అప్పలరాజు, కోడా అప్పలరాజు, చెల్లూరి గోవిందు, యజ్జల తాతీ, మహేష్ తదితరులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బూడిద శ్రీను, బూడిద సైదులు, తంగిరాల రామిరెడ్డి, కారే మునలయ్య, పూరి, ఆనంద్, డి.సుబ్రహ్మణ్యం, ఎస్కే మస్తాన్, వంకాయలపాటి రామదాసు, కె.అప్పలరాజు, భీర్నీడి రమేష్, సుమన్, కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని గుర్తించి ఓటు వేయాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: సమాజంలో జరిగిన అభివృద్ధి, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులను ఉపాధ్యాయులు గమనించి ఆశీర్వదించాలని గురజాల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి కోరారు. స్థానిక విజయ భాస్కర్ కల్యాణ మండపంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఓటు ఎందుకు వేయాలనే అంశంపై ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కాసు చర్చించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. సమాజాన్ని మార్చే శక్తి ఒక్క గురువుకు మాత్రమే ఉంటుందన్నారు. విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని, నిరుపేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్య, నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తామని ఎమ్మెల్యే కాసు హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, కొలా శ్రీనివాసరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు మైల రంగారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.212 కోట్లతో వెల్దుర్తి మండలాభివృద్ధి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి



నాయకులతో కలిసి మాట్లాడుతున్న చైర్మన్ మార్కొండారెడ్డి

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నీ విధాలుగా అభివృద్ధి చేశారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి గృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మండలంలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వెల్దుర్తి మండలాన్ని రూ. 212 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.186కోట్లు, అభివృద్ధికి రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మండాది నుంచి కొత్తపుల్లారెడ్డిపురం వరకు 19కిలోమీటర్ల రోడ్డు రూ. 20కోట్లతో పూర్తి చేశామన్నారు. మండాది నుంచి యత్రబాలెం వరకు రూ. 3 కోట్లతో తారు రోడ్డు పనులు చేసినట్లు వివరించారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూ. 2 కోట్లతో నిర్మాణం చేసి, శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించామన్నారు. ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి, మాచర్ల ఎంపీపీ ఓరుగంటి జయపాల్‌రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, సర్పంచ్ మొగిలి గోవిందు, ఉప సర్పంచ్ కొప్పనాతి సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



ఉపాధ్యాయురాలు నాగ దస్తగిరమ్మకు సన్మానం

దాచేపల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గామాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న గాజుల నాగ దస్తగిరమ్మ మే 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం గామాలపాడులో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నాగ దస్తగిరమ్మను సన్మానించి, అభినందించారు. ఈ సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో నాగ దస్తగిరమ్మ ఉపాధ్యాయులందరికి ఆదర్శమన్నారు. నాగదస్తగిరమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానన్నారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ గన్నే సైదా, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు షేక్ మస్తాన్‌వలి, కొసూరి రవి కుమార్, తగరం ఆనంద్‌కుమార్, చెట్టిపొగు ఏసు రత్నం, నాగెండ్ల ఏసయ్య, మందా రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ‘ఉపాధి’ పనులు కల్పించాలి

రెంటచింతల: ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పాలువాయి గేటు, మల్లవరం, రెంటాల, పాలువాయి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాల్లో 2024 -25 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద రూ.8.50 కోట్ల విలువైన 219 పనులకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతి అభించిందన్నారు. మరో రూ.7.50 కోట్ల విలువైన 254 పనులను కూడా గుర్తించి అనుమతుల కోసం పంపించడం జరిగిందన్నారు. 11 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు అందజేయడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 3,578 మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. రోజు కూలి రూ.300 ఇస్తున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రతకు పనులు జరుగుతున్న ప్రాంతాలల్లో టెంట్‌లు, మెడికల్ కిట్‌లు, మంచి నీటి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీవో జి. జయచంద్ర కుమార్, ఎఫ్ఏలు రామాంజి, సామ్యానాయక్, మణి, ప్రసాద్ తదితరులున్నారు.

మూడవ రోజు మూడు నామినేషన్లు



మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మాచర్ల అసెంబ్లీ అభ్యర్థులుగా శనివారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి, యరమల కృష్ణవేణి, స్వతంత్ర అభ్యర్థిగా డేగల సైద రాజు నామినేషన్లు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం ఏడు నామినేషన్ పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

గురజాలలో ఒక్క నామినేషన్

గురజాల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మూడవ రోజు శనివారం ఒక్క నామినేషన్ దాఖలు అయ్యిందని, రెవెన్యూ డివిజన్ అధికారి జీవీ రమణాకాంత్‌రెడ్డి సూచించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కోయా రామారావు డమ్మీ నామినేషన్‌ను శనివారం అందించినట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

జానపాడు గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: జానపాడు గ్రామం ప్రజలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గ్రామానికి విచ్చేసిన ఆయనకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల్లో జానపాడు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసి, పిడుగురాళ్లకు సమానంగా జానపాడు గ్రామాన్ని తీర్చిదిద్దుతామన్నారు. సుమారు రూ.450 కోట్లతో ఇంటింటికి మంచినీటిని అందిస్తామని తెలిపారు. ఇంటింటికి మంచినీరు, వైద్యం అందిస్తానని ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి చెప్పడంతో.. ముక్త కంఠంతో మంచినీరు, వైద్యమే కావాలని ప్రజలు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, చింతల పూడి శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్‌బాబ పాల్గొన్నారు.

అభ్యర్థికి అండగా.. ఓటు అభ్యర్థిస్తూ..!



కొత్తపల్లి ఎమ్మెల్యే పీఆర్కే సతీమణి రమాదేవి ప్రచారం



ఓటర్లకు అభివాదం చేస్తున్న పీఆర్కే తల్లి రాములమ్మ



ఆలయంలో పూజలు చేసిన రమాదేవి

ప్రచార పర్వం

కారెంపూడి: మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మద్దతుగా ఆయన తల్లి పిన్నెల్లి రాములమ్మ, సోదరి జవ్వాజి నాగమణి శనివారం కారెంపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గాంధీ బొమ్మ సెంటర్, కొట్ల బజారుతో పాటు ఆర్యవైశ్య వీధిలో ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

మాచర్ల రూరల్: ఎమ్మెల్యే, మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. మాట్లాడారు. మాచర్ల ఎమ్మెల్యేగా పీఆర్కేను, నరసరావుపేట ఎంపీగా పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు.

మాచర్ల: మాచర్ల పట్టణంలోని 24, 25 వార్డుల్లో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ కొండలు, కో–ఆప్షన్ మెంబర్ బిజ్జం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మహిళలు ఆమెకు హారతులిచ్చి స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మహేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన రెంటచింతల గ్రామానికి చెందిన డేగల మహేష్‌కు ఆయన నియామక ఉత్తర్వులు అందచేసి, మాట్లాడారు. అనంతరం తన ఎంపికకు కృషి చేసిన పీఆర్కేకు మహేష్ కృతజ్ఞతలు తెలిపి, ఘనంగా సన్మానించారు. బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పూజల రామయ్య, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, మండల జేసీఎస్ కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



వెల్దుర్తి ఎంపీడీఓకు రాజీనామ పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



విజయపురిసౌత్‌లో రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 77 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేశారు. శనివారం ఎంపీడీఓ నరసింహారావుకు పత్రాలను అందజేశారు. ఉప్పలపాడు 21, గంగలకుంట 2, బోదిలవీడు 8, పట్లవీడు 5, రచ్చమల్లపాడు 4, గుండ్లపాడు 5, కండ్లకుంట 2, వెల్దుర్తి 2, శిరిగిరిపాడు 1 నుంచి 19, శిరిగిరిపాడు 2 నుంచి 5, మిట్టమీదిపల్లె నుంచి నలుగురు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

36మంది వలంటీర్ల రాజీనామా

విజయపురిసౌత్: విజయపురి సౌత్‌కు చెందిన 36 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేసి, సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి దస్తగిరికి రాజీనామా పత్రాలను అందజేశారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో మరోసారి ఏర్పడనున్న ప్రభుత్వంలో సేవలందిస్తామని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో భీర్నీడి భరత్, అడ్డూరి రాజు, జి.అనిల్‌కుమార్, కె.మరియ కుమారి, ఎస్.మెప్రూస్ తదితరులున్నారు.

14మంది వలంటీర్లు..

దుర్గి: మండల కేంద్రంలోని దుర్గి–1 సచివాలయం నుంచి తొమ్మిదిమంది మహిళా వలంటీర్లు, దుర్గి–2 నుంచి ఐదుగురు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తాకు సంబంధిత రాజీనామా పత్రాలను అందజేశారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో తమ పరిధిలో ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయాలన్నారు. ఫైర్ ఇంజిన్ వచ్చేలోపు వీలైనంత వరకు మంటలను నియంత్రించేందుకు నీటిని చల్లాలని సూచించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్‌లు షేక్.గౌస్, ఆర్.హుస్సేన్, ఎ.శ్రీనివాసరావు, సాగర్‌బాబు, రామ కృష్ణ, శ్రీనివాసరావు, మోహన్ బాబు, మహేందర్‌రెడ్డి, రమణ నాయక్, సుభాని, బాజీ, నాగేశ్వరరావు, గోవిందు పాల్గొన్నారు.

1, 2, 3 సెర్చ్..!

- అకస్మాతుగా కార్డన్ సెర్చ్‌లు
- ఎన్నికల వేళ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అమలు

సత్తెనపల్లి: అకస్మాత్తుగా..అనుకోకుండా.. మన ఇంటికి పోలీసులొస్తే.. మన అనుమతి లేకుండానే ఇంట్లోకి చొరబడి ఇళ్లంతా వెతికి వెతికి.. మనల్ని ప్రశ్నిస్తే.. ఏం జరుగుతుందో.. ఎందుకొచ్చారో? అసలు కారణం ఏమిటో? అర్థం కాకుండానే మొత్తం తనిఖీలు చేస్తే? అబ్బో ఆ అయోమయం, ఆందోళనే వేరు. కానీ ఇదంతా పోలీసుల కార్డన్ సెర్చ్‌లో భాగం. పోలీసులు అప్పటికప్పుడు ఓ ప్రాంతాన్ని ఎంచుకొని, అక్కడున్న ఇళ్లు తనిఖీ చేసి, స్థానికుల వివరాలను సేకరిస్తూ ఆసాంతం జల్లెడ పట్టడమే కార్డన్ సెర్చ్ ఉద్దేశం. దీనివల్ల అనుమానిత వ్యక్తులు దొరుకుతారు. నేరం చేసిన వ్యక్తుల కదలికల్లో వచ్చే తేడాలు పోలీసులకు అర్థమవుతాయి. నేరం చేయడానికి సన్నద్ధం అవుతున్న ఆలోచనలకు బ్రేక్ పడుతుంది. ఇలా ఎన్నో లాభాలుంటాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ మధ్య కాలంలో తరచూ జిల్లాలో కార్డన్ సెర్చ్‌లు జరుగుతున్నాయి. అసలు వీటి లక్ష్యం ఏమిటో తెలుసుకుందాం రండీ..!

ఎలా నిర్వహిస్తారంటే

పోలీసులు ఏ పరిస్థితుల్లో అయినా కార్డన్ సెర్చ్ నిర్వహించవచ్చు. ఎన్నికల సమయం, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, మురికి వాడలు, పాత నిందితులు ఎక్కువగా తిరిగే ప్రాంతాలు, శివారు ప్రాంతాలను ఎంచుకొని ముందుగా ఆయా ప్రాంత వాసులకు ఎలాంటి సమాచారం లేకుండా.. పోలీసులు అకస్మాత్తుగా వచ్చి ప్రతి ప్రాంతాన్ని, ఇంటిని, వస్తువులు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు.

ఏం చేస్తారు..

ఒకేసారి పోలీసు బలగాలన్నీ కాలనీలను చుట్టుముడతాయి. ఎవరూ బయటకు వెళ్లకుండా బయట ప్రాంతాల వారు రాకుండా చూస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి అణువు జల్లెడ పడతారు. అక్కడున్న వాహనాలు, అనుమానిత వస్తువులు, ఇతర విషయాలపై ఆరా తీస్తారు. రికార్డులు పరిశీలిస్తారు. ఏదైనా అనుమానంగా తోస్తే వెంటనే చర్యలు ఉంటాయి. దీనిలో సుమారు 500 నుంచి 1000 మంది వరకు పోలీసు బలగాలు పాల్గొంటాయి. దాదాపు ఈ సెర్చ్‌లన్నీ రాత్రి వేళల్లో, తెల్లవారుజామున నిర్వహిస్తారు. ఆ సమయంలో అయితేనే నేరస్తుల కదలికలు తక్కువగా ఉంటాయి. వారిని పట్టుకోవడం సులభంగా ఉంటుంది. ఈ సమయంలో అంతా ఇట్టివద్దే ఉండే అవకాశం ఉంది. విచారణ సులువుగా ఉంటుంది.

ఎలా గుర్తిస్తారు...

ముందస్తుగా ఎంపిక చేసిన కాలనీల్లోకి సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది వెళ్తారు. ప్రతి ఇంటికి నోటీసు ఇచ్చిన అనంతరం ఇంట్లోని వారి వివరాలు నమోదు చేస్తారు. వారి వద్ద ఉన్న ఆధార్, ఇతర రికార్డులు తనిఖీ చేస్తారు. అనుమానం ఉంటే అదుపులోకి తీసుకుంటారు. తనిఖీ చేసినట్లు ప్రతి ఇంటికి ఓ స్లిప్ ఇస్తారు. అలాగే రికార్డులు లేని వాహనాలు ఉంటే వాటిని కోర్టుకు అప్పగిస్తారు.

ప్రజలు ఏం చేయాలి

ప్రజలు కార్డన్ సెర్చ్‌లో పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలి. వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డులు, ఇంట్లో ఉన్న వారి వివరాలు, బంధువులు వస్తే వారి వివరాలను తెలియజేయాలి. పోలీసులు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా.. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వాలి. పాత నేరస్తులు, అనుమానస్పద వ్యక్తులు తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి

నకరికల్లు: పోలింగ్ స్టేషన్‌ల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దారు ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. అక్కడ మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.ప్రశాంత ఎన్నికలకు సిద్ధమన్నారు.